డం, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు అటుంచి కనీస మద్దతు ధరలు రాకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటూ దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళనలకు దిగడం తెలిసిందే. రైతాంగ ఉధృత ఆందోళనలకు జడిసి కేంద్రప్రభుత్వం మూడు వ్యతిరేకచట్టాలను ఉపసంహరించుకోక తప్పలేదు. దేశజనాభాలో రెండు శాతం ఉన్న హర్యానా ఇప్పటికీ వ్యవసాయ ప్రధాన రాష్ట్రంగానే ఉంది. పంజాబ్, హర్యానా యువకులు ఎక్కువగా భారత సైన్యంలో చేరి దేశంకోసం యుద్ధాలు జరిగినప్పుడు తమ ప్రాణాలర్పించడం తెలిసిందే. అయితే మోడీ ప్రభుత్వం అగ్నివీర్ పేరుతో తాత్కాలిక నియామకాలు చేసి, ఐదేళ్లు దాటాక వారిని తీసేసి తాత్కాలిక ఉద్యోగాలు ఇచ్చే పద్ధతి ప్రవేశపెట్టడంతో సైన్యంలో పూర్తికాలం పనిచేసే అవకాశం, పింఛన్లు ఇతర సౌకర్యాలు లేకుండా వారి కుటుంబ జీవితాలకు భద్రత లేకుండా చేయడంపై యువతలో తీవ్ర ఆగ్రహం పెల్లుబుకుతోంది.నిరుద్యోగ తీవ్రతవల్ల ఇజ్రాయిల్, రష్యా తదితర దేశాలలో ప్రాణాలొడ్డి కిరాయి సైనికులుగా చేరుతూ ఉండటం ఆందోళనకరమని, ఆస్తులు అమ్మి లక్షలు ఖర్చుచేసి ఉద్యోగాల ఆశతో అమెరికా వెళ్లిన యువతఅక్కడ దుర్భర జీవితం గడపాల్సివస్తోందని అనేకబహిరంగ సభలలో కేంద్రప్రభుత్వంపై రాహుల్‌గాంధీ చేస్తున్న నిశిత విమర్శలు ప్రజలను ముఖ్యంగా యువతను ఆకట్టుకుంటున్నాయి. కాంగ్రెస్ టికెట్ల కేటాయింపులో తన వర్గానికి ప్రాధాన్యత ఇవ్వలేదని గుర్రుగావున ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, కేంద్రమాజీ మంత్రిని బిజెపిలో చేర్చుకోవాలని దళిత ఓట్ల కోసం కమలనాథులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కాంగ్రెస్ దళిత బిడ్డకు అన్యాయం చేసిందని, గతంలో మధ్యప్రదేశ్‌లో జ్యోతిరాదిత్య సింధియాకు కేంద్రమంత్రి పదవిఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చిన కమలం పార్టీ ఈసారి కుమారి శైలజకు మంత్రి పదవి ఇవ్వజూపినా ఆమె తాను తుదివరకు కాంగ్రెస్‌లోనే ఉంటానని ప్రకటించి రాహుల్, భూపేంద్ర హుడాతోబాటు మళ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం కాంగ్రెస్‌కు కలిసివచ్చే అంశం. బిజెపి ఈసారి 22మంది బిసిలు, 17మంది ఎస్సీలు, 16మంది జాట్‌లకు టిక్కెట్లు ఇవ్వగా,కాంగ్రెస్ 20మంది బిసిలకు, అత్యధికంగా 28మంది జాట్‌లకు, 17మంది ఎస్సీలకు టిక్కెట్లుఇచ్చింది. దళితులలో 10శాతం ఉన్న జాతవ్‌లకు బిజెపి 8 స్థానాలు, వాల్మీకులకు నాలుగు, ధనక్‌లకు మూడు, బావారియా బాజీగర్ ఉపకులాలకు చేరో స్థానం కేటాయించి జాగ్రత్తగా వ్యవహరించింది. దళితులు అధికంగా ఉన్న 36 స్థానాల్లో కాంగ్రెస్, బిజెపిలు ఒకే కులం వారికి టిక్కెట్లు ఇచ్చాయి. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ కల్పిస్తామని రాహుల్ ప్రకటించగా, కనీస మద్దతు ధర అంటే తెలుసా అని కేంద్రహోంమంత్రి అమిత్ షా నిగ్గదీశారు. వృద్ధులకు, వికలాంగులకు నెలకు రూ.ఆరువేలు పింఛన్ ఇస్తామని,మహిళలకు నెలకు రెండువేల రూపాయలు సాయంగా ఇస్తామని కాంగ్రెస్ హామీఇవ్వగా బిజెపి రూ.2100 ఇస్తామని పోటీ హామీఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామనే కాంగ్రెస్ హామీ యువతను విశేషంగా ఆకర్షిస్తోంది.రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామని రెండు ప్రధానపార్టీలు హామీఇచ్చాయి. గ్రామీణ పేదలకు ఐదు లక్షల ఇళ్లు నిర్మిస్తామని, ప్రతి కుటుంబానికి రూ.10లక్షల ఆరోగ్యబీమా, 70యేళ్లు నిండిన వారికి మరో ఐదులక్షల అదనపు ఆరోగ్యబీమా కల్పిస్తామని, పల్లెల్లో కాలేజీలకువెళ్లే యువతకు స్కూటర్లు, మోపెడ్లుఇస్తామని, కాంగ్రెస్ అధికారంలో ఉన్నరాష్ట్రాల్లో ముఠా తగాదాలు, అసమ్మతి వల్ల పరిపాలన సజావుగా జరగక అభివృద్ధి అడుగంటిదని, అలాంటి కాంగ్రెస్‌ను గెలిపిస్తే పెట్టుబడులు, పరిశ్రమలు రావని హర్యానా వృద్ధిచెందదని మోడీ హెచ్చరించారు. భారత్‌లో పెట్టుబడి పెట్టడానికి ఎన్నోవిదేశీ కంపెనీలు ముందుకొస్తున్నాయని, పారిశ్రామికీకరణ వల్ల పేదలు, రైతులు, యువతకు మేలు జరుగుతుందని అభివృద్ధి భారత్ అనే దార్శనిక దృక్పథంతో ఎన్డీయే ప్రభుత్వం విధానాలు రూపొందిస్తున్నామని ప్రధాని వివరించారు. ప్రజలు మార్పును కోరుతూ తీర్పు ఇవ్వనున్నారని సర్వేక్షకుల అంచనా. పదేళ్ల పాలనకు చరమగీతంపాడి కొత్త శకాన్ని ప్రారంభిస్తారని ఆశిస్తున్నారు. కాంగ్రెస్, బిజెపి, లోక్‌దళ్, జననాయక్, జనతాపార్టీ, ఆమ్ ఆద్మీపార్టీతోపాటు బలమైననేతలు, టిక్కెట్లు రానివారు స్వతంత్రులుగా బరిలోకి దిగడంతో బహుముఖపోటీలలో ఓట్లు చీలి మెజారిటీకి చేటు చేస్తాయేమోనని ప్రధాన పార్టీలు భీతిల్లుతున్నాయి. అయితే కమలంపార్టీపై పెరుగుతున్న వ్యతిరేకత వల్ల ప్రత్యామ్నాయంగా హస్తం పార్టీకి పట్టం కడతారని సర్వేలు ఘోషిస్తున్నాయి. అక్టోబరు 8న ఫలితాల ప్రకటన వరకు వేచి చూద్దాం. ●

# పేదలున్న ధనిక రాష్ట్రం తెలంగాణ!



డాక్టర్ తిరుణహరి శేషు

ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాట ఫలితంగా భారతదేశంలో 29వ రాష్ట్రంగా 2014 జూన్ 2న ప్రజల ఆకాంక్షల మేరకు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయింది. ఎన్నో సందేహాలు అపనమ్మకాల నడుమ ఏర్పాటైనరాష్ట్రం దశాబ్దకాలంగా తన ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లను అధిగమిస్తూ తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటుంది. ముఖ్యంగా జిఎస్‌డిపి,తలసరి ఆదాయం పెరుగుదలలో, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో, పేదరిక నిర్మూలనలో రాష్ట్రం పురోగమిస్తున్న తీరు విమర్శకులను సైతం ఆశ్చర్యపరుస్తుంది. ఇటీవల ప్రధాన మంత్రి ఆర్థికసలహా మండలి దేశంలోని ధనిక పేద రాష్ట్రాల జాబితాను ప్రకటిస్తే ధనికరాష్ట్రాలలో ఢిల్లీతరువాత తెలంగాణ రెండవ ధనిక రాష్ట్రంగా నిలిచింది. మొదటిఐదు ధనిక రాష్ట్రాలలో దక్షిణాది నుండి తెలంగాణతోపాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలుకూడా చోటు దక్కించుకున్నాయి. ఆర్థిక సలహా మండలి ప్రకారంగా రాష్ట్రం ఏర్పడేనాటికి దేశ జిడిపిలో తెలంగాణ రాష్ట్రం 3.8శాతం వాటాను కలిగిఉంటే 2023-24నాటికి తెలంగాణ రాష్ట్రం వాటా 4.9శాతానికి పెరగటంతో దేశ అభివృద్ధికి కీలక భాగస్వామ్యంఅందిస్తున్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ కూడా చేరిపోయింది.రాష్ట్రం ఏర్పాటైన ఈ దశాబ్దకాలంలో రాష్ట్ర ఆదాయం (జిఎస్‌డిపి) ఐదు లక్షల కోట్ల రూపాయల నుండి 14.64 లక్షల కోట్ల రూపాయలకు పెరిగింది. అలాగే తలసరి ఆదాయం కూడా 1,24,104 నుండి 3,47,299 రూపాయలకు పెరిగిందని తెలంగాణ సోషల్ అవుట్‌లుక్- 24 తన నివేదికలో స్పష్టం చేసింది. తలసరి ఆదాయంలో తెలంగాణ రాష్ట్రం దక్షిణాది రాష్ట్రాలలో మొదటిస్థానంలో దేశంలో మూడోస్థానంలో ఉండటం గమనార్హం. అలాగే తెలంగాణలో పేదరికం 13.18 శాతం నుండి 3.76 శాతాని కి తగ్గిపోయిందని 2023లో నీతి ఆయోగ్ తన రిపోర్టులో వెల్లడిచేసింది. దేశంలో గోవా, కేరళ, తమిళనాడు, సిక్కిం రాష్ట్రాల తర్వాత అతి తక్కువ పేదరికం ఉన్నఐదవ రాష్ట్రంగా తెలంగాణ నిలబడింది. అలాగే సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సంయుక్తంగా ఆరవ స్థానంలో నిలిచాయి. హురూన్ ఇండియా రిచ్‌లిస్ట్-2024 ప్రకారంగా దేశంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న ఐదవ రాష్ట్రంగా తెలంగాణ నిలబడింది. జిఎస్‌డిపి, తలసరి ఆదాయం, ఎస్‌డిజి పేదరికం లాంటి ఎకనామిక్ పారామీటర్స్‌లో తెలంగాణ రాష్ట్రం ఈ దశాబ్దకాలంలో గణనీయమైన ప్రగతి సాధించినా ప్రజల జీవితాలలో మాత్రం గుణాత్మకమైన మార్పులు కనిపించకపోవడం ఒక వైపరీత్యంగానే భావించాలి. తెలంగాణ రాష్ట్రంలో సంపద పెరిగినా ఆ పెరిగిన సంపద కిందివర్గాలకు చేరకపోవడం సంపద పంపిణీలో అసమానతలు పెద్ద సమస్యగా మారిందనే చెప్పాలి. రాష్ట్ర ఆదాయంలో 51శాతం వాటా రంగారెడ్డిపై హైదరాబాద్ సంగారెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలదే అంటే మిగతా 29జిల్లాలు రాష్ట్ర ఆదాయంలో కేవలం 1,80,241 రూపాయలు మాత్రమే. తలసరి ఆదాయం విషయంలో కూడా జిల్లాల మధ్య పెద్దఎత్తున వ్యత్యాసాలు ఉన్నాయి.పేదరికం విషయంలో కూడా జిల్లాల మధ్య పెద్దఎత్తున అంతరాలు కొనసాగుతున్నాయి.కామారెడ్డి వికారాబాద్ ఆదిలాబాద్ గద్వాల ఆసిఫాబాద్ లాంటి జిల్లాలలో పేదరికం 10శాతం కంటే ఎక్కువగానే ఉన్నది. తెలంగాణ రాష్ట్రంలో పేదరికం గ్రామీణప్రాంతాలలో (7.5)ఎక్కువ నిరుద్యోగం పట్టణప్రాంతాలలో (8శాతం)ఎక్కువగాఉండటం, గ్రామీణ పట్టణ తలసరి ఆదాయాలలో కూడా అంతరాలు ఉండటం వలన రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి కిందివర్గాల దరికిచేరటం లేదు. రాష్ట్రఆదాయంలో సేవల రంగంవాటా 65.7శాతంగా ఉన్నా ఎక్కువ శాతం ప్రజలు 45.8 శాతం వ్యవసాయరంగంపై ఆధారపడి ఉండటం వలన రాష్ట్రప్రగతి సంపద కింది వర్గాలకు చేరకపోవడం ఆదాయం పంపిణీలో తీవ్ర వ్యత్యాసాలు, సంపద కేంద్రీకరణ వలన తెలంగాణ పేదలు ఉన్న సంపన్న రాష్ట్రంగా కనపడుతుంది. ప్రతినెల 18వేల కోట్ల రూపాయల రాష్ట్ర ఆదాయంలో రాష్ట్రంలోని పేదలపై చేసే ఖర్చుకూడా చాలా తక్కువ అనేవిషయాన్ని గమనించాలి. ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకున్న ప్రకారంగా రాష్ట్ర ఆర్థికవ్యవస్థ ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా ఎదిగినా 2028 నాటికి ఏడు లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశ పెట్టినా రాష్ట్రంలో పెరిగిన సంపద ఆదాయం కింది వర్గాల కు పేద వర్గాలకు చేరనంతకాలం తెలంగాణ పేదలున్న సంపన్న రాష్ట్రంగానే మిగిలిపోతుంది. తెలంగాణ సంక్షేమ రాష్ట్రంగా ఎదగాలా సంపన్న రాష్ట్రంగా మారాలా అనేది పాలకుల చేతుల్లోనే ఉన్నది. ●

# ప్రజావాక్కు



## బతుకమ్మను గౌరవించాలి

తెలంగాణాలో బతుకమ్మ పండుగ ఎంతో పవిత్రమైనది శ్రేష్ఠమైనది. ఇది ఎన్నో తరాలుగా మహిళలు అత్యంత పవిత్రంగా చేసుకునే పండుగ. నాడు ఈ పండుగ ఎంతో గొప్ప సాంప్రదాయకంగా ఉండేది. కానీ ఈ పండుగను కలుషితం చేస్తున్నారు. దాండియా, గర్బా డిజెలంటూ మన తెలంగాణా ఆచారాలను మంట గొలుపుతున్నారు. ముఖ్యంగా నేటితరం యువతులు డిజెలుపెట్టుకుని కుప్పిగంతులు వేస్తూదాన్ని బతుకమ్మలకు అనువయిస్తున్నారు. ఇది విషసంస్కృతి, అసలు పండుగ అంటే ఆనాటి సంప్రదాయ దుస్తులు ధరించి నాటి తరానికి చెందిన పాటలను పాడుతూ దానికి అనుకూలంగా నృత్యం చేస్తారు. అదే అసలైన బతుకమ్మ పండుగ. మన తెలంగాణా ఆచారాలను పాటించడం ద్వారా తరువాత తరానికి దీనిని అందించే అవకాశం ఉంటుంది.

-శ్రిష్టి శేషగిరి, సికింద్రాబాద్

## పేదల ఆకలి పట్టని రేషన్ డిపోలు

ఆంధ్రప్రదేశ్ ప్రజాపంపిణీవ్యవస్థ ద్వారా అర్హులైన పేదలకు ఉచిత బియ్యంతోపాటురాయితీపై కందిపప్పు, పంచదారను కూడా సరఫరాచేయాల్సి ఉండగా గత నాలుగైదు నెలలుగా కార్డుదారులకు కేవలం ఒక్క బియ్యం మాత్రమే సరఫరా చేస్తూ కొన్ని ప్రాంతాల్లో అరకొరగా పంచదార ఇస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో రేషన్ డిపోలు, గోదాముల్లో తనిఖీలు చేపట్టినప్పుడు పేదలకు ఇచ్చేపంచదార,అంగన్వాడీలకు ఇచ్చేకందిపప్పు, నూనె ప్యాకెట్లు బరువు తక్కువగాఉన్నట్లు గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా కందిపప్పు, పంచదార,నూనె ఇతర ప్యాకెట్ల పంపిణీ నిలిపివేయాలని మంత్రి అధికారుల్ని ఆదేశించారు.

-అప్పన్న గొనప, విశాఖపట్నం

## ఆన్‌లైన్ గేమ్స్‌పై నిషేధం విధించాలి

రాష్ట్రంలో ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్,బెట్టింగ్‌లపై నిషేధం ఉన్నప్పటికీ చాలా మంది విరివిగా ఆడుతున్నారు. విపిఎన్ సాయంతో లొకేషన్ మారుస్తూ వినియోగిస్తున్నారు. ఈ ఆన్‌లైన్ గేమ్స్‌వల్ల యువత డబ్బును కోల్పోవడమే కాకుండా తమ విలువైన ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. దీనిపై ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలి.

-ఎం.ముత్యం రెడ్డి, అందెగ్రామం, సిద్దిపేటజిల్లా

## మానవత్వం చూపాలి

ప్రతీ సంవత్సరం ఆనవాయితీగా అక్టోబరు రెండవతేదీన మహాత్మాగాంధీ ఫొటోలకు విగ్రహాలకు పూల దండలతో అలంకరించి ఎవరికీ తోచింది వారు కాసేపు మాట్లాడి మమ అనిపిస్తున్నారే కాని ఆ మహానుభావుడి ఉన్నత ఆశయాలైన సత్యం, అహింసలకు ఏనాడో తిలోదకాలు ఇచ్చేశాము. ఆడది అర్థరాత్రి ఏ అవరోధం లేకుండా బయట తిరగగలిగినప్పుడే మనకు సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చినట్టని మన జాతిపిత అన్న మాటలు వాస్తవ రూపం దాల్చాయా అని మనంప్రశ్నించుకుంటే ఏ సమాధానం దొరుకుతుందో తెలియంది కాదు. గాంధీని మహాత్ముడని రవీంద్రనాథ్ ఠాగూర్ చేత కీర్తింపబడినా, ఫాదర్ ఆఫ్‌ది నేషన్ అని నేతాజి చేత పొగడబడినా వాటి విలువలను మనం ఎంత వరకు కాపాడుకుంటున్నామో ప్రశ్నించుకోవాలి. మానవత్వం ప్రదర్శించని వారు మహాత్ముని వారసులనిపించుకోరు.

-ఎన్.రామలక్ష్మి, సికింద్రాబాద్

## వీరు నాయకులేంటి?

ఏకొద్ది మందో తప్ప లోక్‌సభకు ఎన్నికయిన సభ్యులు, మంత్రులు విద్యావంతులే అయినా వింత పశువుల్లా ప్రవర్తిస్తున్నారు. రెచ్చిపోతున్నారు. రంకెలు వేస్తున్నారు. సంస్కారం లేకుండా, ఎవరేం అనుకుంటారో అనే ఆలోచన చేయకుండా ప్రత్యర్థులపై విరుచుకుపడుతున్నారు. నాలుకకోయండి డబ్బులిస్తాం చంపేయండి సంతోషిస్తాం అంటూ వారిని తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. ఈ విమర్శలు వినడానికి కర్ణకఠోరంగా ఉంటున్నాయి. మహిళలపై అత్యాచారాలు చేసిన వారిని, లైంగికంగా వేధించిన వారిని హంతకులను కాపాడుకున్న వారి నోటి నుంచి ఇలాంటి మాటలు కాక మంచి మాటలు ఎలా వస్తాయి?

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

## ఆన్‌లైన్ పోర్టల్‌ను ఏర్పాటు చేయాలి

సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులను దాఖలు చేయడానికి ఆన్‌లైన్ పోర్టల్‌ను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావాలి. ఇదే విషయంపై జాతీయ సర్వోన్నత న్యాయస్థానం గత యేడాది మార్చిలో స్పందించి ఆర్టీఐ వెబ్‌సైట్లను మూడు నెలల్లో అందుబాటులోకి తీసుకురావాలని కోరినా మన రాష్ట్రంతోపాటు మరొక పది రాష్ట్రాల నుండి ఎటువంటి స్పందన రాలేదు. వెంటనే సుప్రీంకోర్టు తీర్పును ఆయా రాష్ట్రాలు ఆచరించాలి.

-పద్మనాభుని మణిదీప్, ఊటుకూరు


ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail: editpage@vaartha.com

# ప్రభుత్వాల నిర్లక్ష్యాలకు కుదేలవుతున్న ఆర్థికరంగాలు

జోస్యుల వేణుగోపాల్

మానవ తప్పిదమో లేక దైవ సంకల్పమో తెలియదు కానీ నేడు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోను, భూకంపాలు,సునామీలు, టోర్నడోలు, వాయుగుండాలు,వేడిగాలులు, అగ్నిపర్వతాల్లో మంటలు. మంచు తుఫానులు లాంటి తీవ్రమైన ప్రాణ, ఆర్థిక,నష్టం కలిగించే ప్రకృతి ప్రమాదాలతోపాటు, మానవ సహసమైన నిర్లక్ష్యంతో ఫ్యాక్టరీల్లో అగ్నిప్రమాదాలు, రహదారి ప్రమాదాలు, ముందు జాగ్రత్త లేని వరద ప్రమాదాలు, కొండ చరియలు విరిగిపడడం లాంటివి జన జీవనాన్ని అతలాకుతలం చేస్తూ, ప్రజల ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితులను దిగజారుస్తున్నాయి. పొరుగుదేశమైన పాకిస్థాన్‌లో ఇటీవల ముంచెత్తిన వరదల్లో రెండువేల మంది దాకా మరణిస్తే డెబ్బై లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఇలాగే ప్రపంచవ్యాప్తంగా జరిగే నష్టాలు మన ఊహకే అందని పరిస్థితి. మనదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం గురించి కనీసం అధ్యయనం కూడా చేయడం లేదు. సంవత్సరాలుగా అనేక శ్రమలకోర్చి ప్రజలు సంపాదించుకున్నవీ, ఎంతో ఖర్చుపెట్టి ప్రభుత్వాలు అభివృద్ధి చేసినవి ప్రమాదాల్లో హరించుకుపోతున్నాయి. ఇటీవల తెలుగురాష్ట్రాల్లో జరిగిన వరద నష్టం మరీ దారుణం. ఎంతగా టెక్నాలజీ పెరిగినా ప్రమాద తీవ్రతను ముందుగా అంచనా వేసి ప్రజలను అప్రమత్తం చేసే యంత్రాంగాల నిర్లక్ష్యం ఎందరి బతుకుల్లోనో విషాదాన్ని నింపింది. లక్షల హెక్టార్ల పంట నీటిపాలైంది. సంవత్సరాలుగా కష్టపడిడబ్బు పొదుపు చేసుకుని, చిన్న ఇల్లు ఏర్పాటు చేసుకుని పిల్లలను కొద్దిగా చదివించుకుంటూ పర్వాలేదులే అనుకున్న భరోసా వరదల్లో కొట్టుకుపోయి నేడు జీవితం సున్నా నుంచి మొదలు పెట్టాల్సి రావడం దురదృష్టం. గోదావరి, కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో నివాసముంటున్న తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎప్పుడూ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని బతకాల్సిందే. కారణం ప్రభుత్వాలవైపు నుండి ముందస్తు కార్యాచరణశూన్యం. అన్నిట్లోను రాజకీయ కోణాలేతప్ప ప్రజల ప్రాణాలు లెక్కలేదు. వరదల్లో జరిగిన పంట నష్టం రైతుకే కాకుండా రాష్ట్రానికి, దేశానికి కూడా ఆర్థిక నష్టమే. ప్రమాదాలు జరిగిన తర్వాత బాధితుల కోసం శిబిరాలు,



ప్రభుత్వ భోజన ఏర్పాట్లు వారికి నష్టపరిహారం ఇవ్వాల్సి రావడం ప్రభుత్వ ఖజానాకు పెనుభారమవుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాదాపు వందలకోట్ల రూపాయలు పరిహారం కోసం విరాళాలుగా సేకరించింది. లేకుంటే అంత మొత్తం ప్రభుత్వమే భరించాలంటే అభివృద్ధి కుంటుబడుతుంది కదా! రహదారులు పాడైపోయి రవాణా సౌకర్యం లేక రైల్వేలు, ఆర్.టి.సి సంస్థలే కాకుండా అనేకమంది వ్యాపారస్తులు కోట్లాది రూపాయల నష్టాన్ని మూటగట్టుకున్నారు. ఇక ఈ విపత్తుల వల్ల జరుగుతున్న పర్యావరణ, ప్రాణహాని అంతా ఇంతా కాదు.ఎంతో ఖర్చుపెట్టి ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, సబ్ స్టేషన్లు, విద్యుత్ పోల్స్ అన్ని నేలకొరిగి పునరుద్ధరణకు చాలా ఖర్చుఅవుతోంది. ఈ ప్రమాదాల వల్ల ప్రపంచ ఆర్థికవ్యవస్థ మొత్తం అత్యంత దిగువ స్థాయికి చేరుకుంటోంది. దేశంలో ఇంత పెద్ద నష్టం జరిగినప్పుడు కేంద్రప్రభుత్వం మాటలకు పరిమితం కాకుండా వెంటనే రాష్ట్రాలకు ఆర్థికసహాయం అందించాల్సిన అవసరం ఉంది. విపత్తు నష్టాన్ని అంచనావేసేందుకే రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని రోజులు, కేంద్రం ఇంకొన్ని రోజులు సమయం తీసుకొని నష్ట పరిహారాన్ని నీరుగార్చి ప్రజలను పరేషాన్ చేస్తున్నారు. ప్రధానమంత్రి నేతృత్వంలో జాతీయ విపత్తుల నిర్వహణ కమిటీ ఉన్నా వాటికి నిధులున్నా త్వరితగతిన స్పందన కరవు. వరదల్లో కూడా రాజకీయ బురదలంటుకున్న ప్రజలు ఆర్థిక స్వావలంబన కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా హంగు, ఆర్భాటాలకు ఎక్కువ ఖర్చుపెట్టకుండా, కేంద్రప్రభుత్వం మీద ఆధారపడకుండా విపత్తుల నిధులను ఏర్పాటుచేసుకోవాలి.కేవలం దాతలను ఆశ్రయించడం సరైన విధానంకాదు.అనేక ప్రైవేట్ స్వచ్ఛంద సంస్థల సేవల ఆర్థిక వెన్నుదన్ను ఈ సమయంలో ప్రశంసించదగ్గది.ప్రజలకిచ్చే నష్టపరిహారం కూడా ఎన్నో అవరోధాలు దాటుకుని వారికివచ్చేది జరిగిన నష్టంలో పదోవంతు మాత్రమే.నిష్క్రియాపర్వంతో ముందుచూపు కొరవడి రెవెన్యూలోటుతో ప్రతినెలా అప్పులకువెళ్తున్న కేంద్రరాష్ట్రాల ప్రభుత్వాలు చేసే ఆర్థికసహాయం కోసం ప్రజలు ఆశపడడం కూడా దండగే. రాష్ట్రాల్లో ముఖ్యమంత్రిస్థాయి నుండి గ్రామస్థాయి చిన్న అధికారి వరకు పాలనపైనే దృష్టి పెట్టి ప్రజల సౌకర్యమే పరమావధిగా అవగాహనతో,సమన్వయంతో పని చేస్తే కొంత ఆర్థిక నష్టాలను నివారించవచ్చు.అలాగే ప్రజలు ప్రభుత్వాలపైన భారంవేసి ప్రమాదకరమైన ప్రాంతాల్లో నివసిస్తూ కూడాఅప్రమత్తంగా ఉండకుండా గడుపుతుంటే ఆర్థిక నష్టాలతోపాటు ప్రాణాలకు కూడా ముప్పుఏర్పడుతుంది. ●

## విలేజ్ పార్కును పరిశీలించిన కలెక్టర్

యల్లనూరు, అక్టోబర్ 1 ప్రభాతవార్త



విలేజ్ పార్కును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

మండలంలోని తిమ్మంపల్లి గ్రామంలో నిర్మించిన విలేజ్ పార్కును మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. గ్రామంలో ఇలా పార్కు నిర్మించినందుకు చాలా సంతోషంగా వుందని ఉపాధి సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వీరాజు, ఏపిడి వెంకటరత్నం, ఏపిఓ షబ్బీర్‌బాష, టిఏ జయరాం, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

## నవదుర్గ వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

దుర్గ వేషధారణ చిన్నారులతో కరస్పాండెంట్ రమేష్‌రెడ్డి



పుట్లూరు, అక్టోబర్ 1 ప్రభాతవార్త

దసరా శరన్నవరాత్రులు ప్రారంభం నేపథ్యంలో మండల కేంద్రంలోని రాయలసీమ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం ముందస్తు దసరా వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు నవదుర్గ అమ్మవారి వేషధారణలో అందరిని ఆకట్టుకున్నారు. అదేవిధంగా దసరా పండుగ విశిష్టతను కరస్పాండెంట్ రమేష్‌రెడ్డి విద్యార్థులకు తెలియచేశారు. చిన్నతనం నుండి పిల్లలకు పండుగల విశిష్టతను తెలియచేయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన తెలియచేశారు. అనంతరం అమ్మవారి వేషధారణలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యం హాజరైన వారిని అబ్బురపరిచింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

యాడికి, అక్టోబర్ 1 ప్రభాతవార్త



రక్తదానం చేస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీచెన్నకేశస్వామి ఆలయం సమీపంలో మంగళవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. అక్టోబర్ 1 జాతీయ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్, ఓ విలేకరి సామాజిక కార్యకర్త సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు విలేకరి ఆలూరు చంద్రశేఖర్ తెలిపారు. మొత్తం 88 యూనిట్ల రక్తాన్ని సేకరించామని ఇంత మంచి స్పందన రావడం పట్ల రక్తదాతలకు ఫౌండేషన్ అధ్యక్షులు బండారు బాలకృష్ణ కృతజ్ఞతలు తెలియచేశారు. ఇందులో 30 యూనిట్ల రక్తాన్ని అనంతపురం బ్లడ్‌బ్యాంకు అందచేయడం జరుగుతుందని సేవా బ్లడ్ సెంటర్ తాడిపత్రి పేరి అశోక్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణకు 5 వేల రూపాయలను నేతిబొట్టు కుళ్లాయమ్మ జ్ఞాపకార్థం ఆమె బంధువులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ శివకుమార్, సిబ్బంది, పేరి విజయ్‌కుమార్, పవన్‌కుమార్, పేరి అశోక్‌కుమార్, సుమిత్ర, స్వప్న, మహేంద్ర, గుత్తి విలేకరి కాయపాటి నరేష్‌యాదవ్, చందాని ధృవనారాయణ, బడిగించల వేణు, సాయివరపు నాగరాజు, చింతా నరసింహ, సిద్ధవటం తిరుమలరెడ్డి, మెటికల చెన్నయ్య, సాకరే శంకరప్ప, గాంధీజీ స్కూల్ రామమోహన్, కావలి సుధాకర్ (వెంకటాంపల్లి), వేదుకాపురం ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## శివాలయంలో మాసశివరాత్రి పూజలు

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 1 ప్రభాతవార్త



శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామిని అలంకరించిన దృశ్యం

తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మాసశివరాత్రి పూజలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు పరమేశ్వరునికి పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామివారిని వెండిముఖకవచంతో పాటు వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేక ంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారిని అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, నందుస్వామి, రామకృష్ణశర్మలు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.

## ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ



ఫించన్ మొత్తాన్ని అందచేస్తున్న కౌన్సిలర్ విజయ్‌కుమార్

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 1 ప్రభాతవార్త

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లను మంగళవారం ఉదయం 6 గంటలకే పట్టణంలోని నందలపాడులో కౌన్సిలర్ విజయ్‌కుమార్ లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి సూచనల మేరకు ఆయన వార్డులోని 269 మంది వృద్ధాప్య, వితంతులకు 4 వేల చొప్పున, 55 వికలాంగులకు 6 వేల రూపాయల చొప్పున మొత్తం 14,64,500 రూపాయలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ నారాయణస్వామి, భాను, శిల్ప, మున్సిపల్ సిబ్బంది షాకీర్, టిడిపి నాయకులు దొరస్వామి, పవన్, జయ, తదితరులు పాల్గొన్నారు.

## పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్

యల్లనూరు, అక్టోబర్ 1 ప్రభాతవార్త

మండలంలోని బొప్పేపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నువించుకోవడం జరిగింది. కెవికె శాస్త్ర వేత్తలు రైతులకు అధునాతన వ్యవసాయ పద్ధతుల గురించి అవగాహన కల్పించడం జరిగింది. వరి, పప్పుశనగ, మొక్కజొన్న, దానిమ్మ, బత్తాయి పంటలకు వచ్చే చీడపీడల గురించి, వాటి నివారణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మల్లికార్జునాయుడు దానిమ్మ తోటలో డ్రోన్‌తో స్ప్రేయింగ్ చేయడాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రఘునాథ, తహశీల్దార్ నాగార్జున, ఎంపిడిఓ వీరాజు, ఎఓ రామకృష్ణుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## 34వవార్డులో ఫించన్ల పంపిణీ

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 1 ప్రభాతవార్త



ఫించన్ మొత్తాన్ని అందచేస్తున్న దృశ్యం

పట్టణంలోని 34వ వార్డులో మంగళవారం ఉదయం 6 గంటలకే ఎన్‌టిఆర్ భరోసా సామాజిక ఫించన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ పావురాల శీనయ్య ఆధ్వర్యంలో వార్డులోని వికలాంగ, వితంతు, వృద్ధాప్య ఫించన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డులోని ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు ఫించన్ మొత్తాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 269, 270 బిఎల్‌ఎ సూర్యనారాయణ (సూరి), బడుగు రాజగోపాల్, ఎం.సువార్తయ్య, డి.రాజేష్, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## బొలేరో కంటైనర్ ఢీ ఒక్కరు మృతి....

తనకల్లు, అక్టోబర్ 01 ప్రభాతవార్త:



ప్రమాదంలో మృతి చెందిన భార్గవ్

తనకల్లు మండలంలోని నల్లగుట్లపల్లికి చెందిన వన్నె శంకరప్ప కుమారుడు భార్గవ్ (25) చీకటి మానపల్లి సమీపంలో బులోరా వాహనం కంటైనర్ వాహనం ఢీ కొట్టడంతో డ్రైవర్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టడం జరిగింది. బులోరా వాహనం మొలకలచెరువుకు టమోటాలు వేసుకొని అక్కడి నుండి తిరిగి ప్రయాణంలో చీకటిమానపల్లి సమీపం ఈదల వంక దగ్గర కదిరి నుండి వచ్చే కంటైనర్ వాహనంను అతి వేగంతో వచ్చి పక్కన వస్తున్న బులోరా వాహనాన్ని ఢీ కొనడంతో బులోరా డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమ్మితం తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## జిల్లా స్థాయి పోటీలకు రెయిన్బో విద్యార్థులు




విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం జయసింహారెడ్డి

ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 1, ప్రభాతవార్త

స్థానిక రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయసింహారెడ్డి తెలియచేశారు. వీరిని అభినందిస్తూ మంగళవారం రెయిన్బో పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జయసింహారెడ్డి మాట్లాడుతూ...మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో తమ పాఠశాలకు చెందిన లయశ్రీ 10వ తరగతి, యశ్వంత్ నాయుడు 9వ తరగతి, హర్షవర్ధన్‌రెడ్డి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం హర్షించదగ్గ విషయం అన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి అత్యుత్తమ శిక్షణ ఇచ్చి ఉపాధ్యాయులు జనార్ధన్‌రెడ్డి, శ్రీధర్, మంజునాథ్, ప్రతాప్, ముక్తిరాజ్‌ను ప్రధానోపాధ్యాయులు జయసింహారెడ్డి ప్రత్యేక అభినందనలు తెలియచేశారు. అలాగే జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

## వరదబాధితులకు ఆర్థిక సహాయం



నగదు అందచేసిన కృష్ణారెడ్డి, రాజారెడ్డి

అమడగూరు, అక్టోబర్ 1 ప్రభాతవార్త

విజయవాడ వరదబాధితుల సహాయార్థం మండలంలోని గుండువారిపల్లికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు కడపల కృష్ణారెడ్డి 50 వేల రూపాయలు, రాజారెడ్డి 50 వేల రూపాయలను అందచేశారు. దీంతో మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు వారిని అభినందించారు. మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మరింత విరాళాలు సేకరించి రెండవసారి ఎమ్మెల్యేకు అందచేస్తామని ఆయన తెలిపారు.

## అవ్వాతాత గుడ్‌మార్నింగ్ తీసుకో పెన్షన్

పెన్షన్ కానుకలను అందచేస్తున్న టిడిపి నాయకులు



ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 1, ప్రభాతవార్త

నిద్రలేపి అవ్వాతాతలకు గుడ్‌మార్నింగ్ చెబుతూ కూటమి నాయకులు మండల వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. మంగళవారం తెల్లవారు జామునుంచే లబ్ధిదారులకు అధికారులు గుడ్‌మార్నింగ్ చెబుతూ పింఛన్లను పంపిణీ చేశారు. జడ్పీటిసి మాజీ సభ్యుడు పిట్టా ఓబుళరెడ్డి, కన్వీనర్ జయచంద్ర, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంజినప్ప, రైతు మీడియా కోఆర్డినేటర్ డాక్టర్ జాకీర్ అహ్మద్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బడిశం రామాంజినేయులు, మాజీ కన్వీనర్ రాజారెడ్డి, నియోజకవర్గ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి ఇడగొట్ట ఆంజనేయులు, టిఎన్‌టియుసి నిజాం, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ ఆరీఫ్‌ఖాన్, తౌఫిక్, డీలర్లు గంగాద్రి, షమూన్, కొండే ఈశ్వరయ్య, జయచంద్రారెడ్డి, గంగులప్ప, బత్తినిపల్లి చలపతి, ఎద్దుల శివారెడ్డి, ఎద్దుల కరుణాకర్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు ఎస్ అంజిన్‌రెడ్డి, బూదిలి సాంబశివారెడ్డి, గండికోట ఇర్షాద్, బాలక్రిష్ణారెడ్డి, శంకరయ్య, సంగాల శ్రీనివాసులు, బీలే నాయక్, మీసేవ సుధాకర్, సాదీ నాగరాజు, మస్తానమ్మ, ఎంపీటిసి శ్రీనివాసులు, సర్పంచ్ శంకర్‌రెడ్డి, జెరిపిటి ప్రసాద్, చంద్రాయుడు, మాజీ ఉపసర్పంచ్ సాదిక్‌వలి, గండికోట భాస్కర్, కోటబజారు భాస్కర్, ఐరన్ కేశవ, డ్రైవర్ జయచంద్ర, దారా శ్రీనివాసులు, ఆనంద్‌రెడ్డి, నరసింహారెడ్డి, విజయ్ తదితర నాయకులు ఆయా గ్రామాల్లో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నప్పటికి వాటిని అధిగమించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీల అమలు చేస్తున్నారన్నారు. అవ్వాతాతలకు ఒకటవ తారీఖునే ఇంటి వద్దేకే పింఛన్లు అందచే ఏర్పాటు చేశారన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో రూ 250 దపదఫాలు పెంఛన్ పెంచి ఐదు ఏళ్లకు రూ 3 వేలు ఇచ్చారన్నారు. చంద్రబాబు ఒకే రూ వెయ్యి పెంచి అవ్వాతాతలకు పెద్ద కొడుకుగా ఆదుకుంటున్నాడన్నారు.

## రైతులకు సబ్సిడీపై పప్పుశగన విత్తనాలు ఇవ్వాలి

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు



పుట్లూరు, అక్టోబర్ 1 ప్రభాతవార్త

రైతులకు రబీ సీజన్‌లో 50 నుండి 60 శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేయాలని కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు, మండల కార్యదర్శి సత్తార్ గోపాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వస్తే సామాన్య ప్రజలతో పాటు రైతులకు ఎన్నో విధాలుగా ఊరట కలుగుతుందని ఆశపడి అధికారాన్ని కట్టబెట్టారని కానీ కూటమి ప్రభుత్వం రైతులకు ఆశించినతంగా సహాయ సహకారాలు అందించడంలేదన్నారు. రబీ సీజన్‌లో పప్పుశనగ విత్తనాలు బయట మార్కెట్‌లో 7300 రూపాయలు వుంటే అందుకు భిన్నంగా ప్రభుత్వం ప్రకటించిన ధర 9400 రూపాయలకు ఇస్తూ సబ్సిడీ కేవలం 25 శాతం అంటే 2300 రూపాయలు పోను 7050 రూపాయలు రైతులు చెల్లించాలని అధికారులు ప్రకటించడం దారుణమన్నారు. రైతులను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల గౌరవాధ్యక్షులు టి.బాలగురయ్య, ఉపాధ్యక్షులు చిన్నికృష్ణుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నకుళ్లాయప్ప, మండల నాయకులు గోపాలకృష్ణ, రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి టి.ఓబులయ్య, కమిటీ మెంబర్లు అంకిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, నాగమణింద్ర, రైతులు అంజనప్ప, పెద్ద నరసింహులు, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## టెక్ కళాశాలలో వరల్డ్ విజిటబుల్స్ డే

తాడిపత్రిరూరల్, అక్టోబర్ 1 ప్రభాతవార్త



కూరగాయలతో అలంకరించిన దృశ్యం

పట్టణ సమీపంలోని ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం వరల్డ్ విజిటబుల్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కూరగాయల విశిష్టత, అరోగ్యపరంగా ఐరన్, మిటమిన్లు కలిగి వుంటాయని తెలిపారు. ఇందులో భాగంగా కూరగాయలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విభాగాధిపతి ఎంసి భానుప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇవి సుబ్బారెడ్డి, డైరెక్టర్ నటరాజేశ్వర్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం మహాపుణ్యకార్యం

రక్తదానంపై అవగాహణ కల్పిస్తున్న సిఐ యుగంధర్.




పామిడి, అక్టోబర్ 01 ప్రభాతవార్త

రక్తదానం మహాపుణ్యకార్యం అని సిఐ యుగంధర్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురష్కరించుకుని మంగళవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకటనారాయణరెడ్డి ఆద్వర్యంలో రక్తదానంపై అవగాహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సిఐ యుగంధర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే రక్తదానం చేస్తూ సేవా దృక్పదాన్ని అలవర్చుకోవాలని కోరారు. రక్తదానం చేయటం ద్వార మరొకరికి పునర్జన్మను ప్రసాదించటం జరుగుతుందని అందువల్ల ప్రతిఒక్కరూ రక్తదానం చేయండి ప్రాణదాతలు అవ్వండని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకటనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువత ఒక ఉన్నతమైన లక్ష్యంతో ముందుకెళ్తూ సమాజాభివృద్ధిని ఆకాంక్షిస్తూ సేవా కార్యక్రమాలకు పునరింకితం కావాలని సూచించారు. ఈకార్యక్రమంలో జనవిజ్ఞానవేధిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్, అభయ డోనర్స్ అద్యక్షులు షామీర్, సుంకిరెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిఫల్ కృష్ణకుమార్, అద్యాపక సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అండగా ఏర్పాటైన ప్రభుత్వమే చంద్రబాబునాయుడు ప్రభుత్వం

- టిడిపి మండల కన్వీనర్ ముసలిరెడ్డి

పామిడి, అక్టోబర్ 01 ప్రభాతవార్త



ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేస్తున్న టిడిపి మండల కన్వీనర్ ముసలిరెడ్డి

ప్రజల ఆశలు ఆకాంక్షలను నెరవేర్చటమే లక్ష్యంగా చంద్రబాబునాయుడు సారాధ్యం ప్రజాప్రభుత్వం ఏర్పాటైందని టిడిపి మండల కన్వీనర్ ముసలిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిదిలోని పొగురూరు గ్రామంలో మంగళవారం అధికారులు ఎన్డీఏ కూటమి పార్టీల శ్రేణులతో కలిసి టిడిపి మండల కన్వీనర్ ముసలిరెడ్డి ఇంటి వద్దకే వెళ్ళి లబ్దిదారులకు ఎన్టీఆర్ భరోసా కింద సామాజిక భద్రత పెన్షన్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ముసలిరెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో తొలిసారిగా ఒకేరోజు పెన్షన్లు పంపిణీ చేయిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఈక్రమంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలపాలన్నదే ఆయన ముఖ్యఉద్దేశ్యం అన్నారు. మాది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అంటూ మేము చెప్పామంటే చేసి చూపిస్తామని ఎన్టీఆర్ భరోసా కింద సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీనే అందుకు నిదర్శనం అని తెలిపారు. మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను తొలిరోజే వందశాతం పంపిణీ చేసేందుకు అధికారులతో కలిసి అన్నివిధాల చర్యలు చేపట్టడం జరిగిందని ముసలిరెడ్డి వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఎన్డీఏ కూటమి పార్టీల శ్రేణులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో ఫించన్ పంపిణీ చేశాం

- పంచాయితీ కార్యదర్శులు,నాయకులు.

అనంతపురం రూరల్,అక్టోబర్01ప్రభాతవార్త:

అనంతపురం రూరల్ మండలంలోని ఫించన్‌దారులందరికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బందితోను,స్థానిక నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి ఫించన్‌ను సకాలంలో ఫించన్‌దారులకు పంపిణీ చేయడం జరిగిందని పంచాయితీ కార్యదర్శులుఅశోక్‌బాబు, మహేశ్వరరెడ్డి,యు.హిదయతుల్లా,మహమ్మద్‌రఫి,సర్దార్‌వలి, నరసింహారెడ్డి, మల్లికార్జునరెడ్డి టిడిపినాయకులుతెలిపారు.

## మీరిప్పుడు డిజిటల్ అరెస్ట్ అయ్యారు!

### రూ.7 కోట్లు చెల్లించండి

### వర్ధమాన్ అధిపతికి సైబర్ టోపీ



**ముంబయి, అక్టోబరు 1:** సుప్రీంకోర్టు చీఫ్‌జస్టిస్ డివైచంద్రచూడ్‌గా ఫోజులిచ్చి వర్చువల్ కోర్టు హాల్‌ను ప్రతిబింబిచే విధంగా మాట్లాడి బోగస్ డాక్యుమెంట్లు చూపించి సాక్షాత్తూ వర్ధమాన్ గ్రూప్ యజమానినే బురిడీ కొట్టించిన సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనలో వర్ధమాన్‌గ్రూప్ అధిపతి ఎస్పీ ఓస్వాల్ ఏడుకోట్ల రూపాయలు మేరకు మోసపోయి నట్లు ఆయనే స్వయంగా ఫిర్యాదు చేసాడు. ఆగస్టు 28, 29 తేదీల్లో ఓస్వాల్ గ్రూప్ అధి పతిని డిజిటల్ అరెస్ట్ పేరిట బెదిరింపులకు గురిచేసి ఏడు కోట్లరూపాయలను అనేక ఖాతా లకు బదిలీచేయించుకున్నారు. పోలీసులు ఎట్ట కేలకు గుర్తించి ఆ ఖాతాలన్నింటినీ స్తంభిం పచేసి సుమారు ఐదుకోట్ల రూపాయల వరకూ రికవరీ చేయగలిగారు. 82యేళ్ల పారిశ్రామికవేత్త మాట్లాడుతూ సైబర్ ఓసగాళ్లు ఎంతగా తనను బెదిరించి సొమ్ములు ఎలా లాగేసు కున్నారో వివరించారు. మీపై మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో ఉందంటూ బెదిరింపులు ప్రారంభించినట్లు తెలిపారు. మొదట గతనెల 28వ తేదీ తనకు ఫోన్‌కాల్ వచ్చిందని మీరు 9నంబరు బటన్ ప్రెస్‌చేయకపోతే మీ ఫోన్ డిస్కనెక్ట్ అవుతుందని బెదిరించారు. తర్వాత 9 ప్రెస్‌చేస్తే ఆవిలవైపు వ్యకినత సిబిఐ కొలాబా ఆఫీసునుంచి మాట్లాడుతున్నట్లు చెప్పాడు. తనపేరిట కెనరాబ్యాంకు ఖాతా ఉందని చెప్పా దని అయితే ఆ ఖాతా తనది కాదని చెప్పినా మీపేరుమీదనే ఉందని ఈ ఖాతాపై కొన్ని ఆర్థిక అవకతవకలు జరిగాయని బెదిరించాడన్నారు. ఆ తర్వాత ఒక విడియోకాల్ కనెక్ట్‌చేసారని, .జెట్ ఎయిర్‌వేస్ ఛైర్మన్ నరేష్ గోయల్‌కేసుతో మీ బ్యాంకు ఖాతా లింక్ అయి ఉందని, మనీ లాండరింగ్‌కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపార న్నారు. తనకు నరేష్ గోయల్ తెలియదని, ఆ ఖాతా తనది కాదని చెప్పినా వారు వినిపించు కోలేదని, మీ ఆధార్ వివరాలతో ఖాతా ప్రారం భించారన్నారు. తాను జెట్‌ఎయిర్‌వేస్‌లో ప్రయాణం చేసానని, గుర్తింపుకోసం చూపించి ఉండవచ్చుని చెప్పానని ఓస్వాల్ చెప్పారు. తనను డిజిటల్ కస్టడీలో ఉంచినట్లు చెప్పా రన్నారు. పూర్తిగా సహకరిస్తే ఈకేసునుంచి రక్షిస్తామని చెప్పారని, ఆదిశగా సహకరించాలని కోరారు. విడియోకాల్‌లో రాహుల్‌గుప్తా అనే వ్యక్తి తాను ప్రధాన విచారణ అధికారిగా చెప్పు కున్నాడని, నిఘాకు సంబంధించిన 70 రూల్స్ చెప్పాడని అంతేకాకుండా ప్రాధాన్యతా క్రమం లో దర్యాప్తు వెంటనే పూర్తిచేయాలని కోరుతూ లేఖ ఇవ్వాలని కోరారన్నారు.

తన బాల్యం, విద్యా, బిజినెస్ వివరాలు అన్నీ తెలుసుకు న్నారని, తన ఆస్తుల వివరాలు కూడా అడిగా రని, మా మేనేజర్‌ను అడిగి చెపుతానన్నారు. జాతీయ రహస్యాల చట్టంపరిధిలో కేసు ఉందని, ఎవ్వరికీ రివీల్ చేయవద్దంటూ బెదిరిం చారని, ఎవరికి చెప్పినా వెంటనే జైలుకుపోతా రన్నారు. సివిల్‌డ్రెస్‌లు వేసుకుని మెడలో ఐడి కార్డులు వేసుకున్నారని, వెనుకవైపు జాతీయ పతాకం కనిపించిందన్నారు. ఒక కోర్టురూమ్‌ను చూపించి చీఫ్‌జస్టిస్ డివైచంద్రచూడ్ ఈకేసు విచారణ చేస్తారని ఆదేశాలు జారీచేసారన్నారు. వాట్సాప్‌లో ఈ ఉత్తర్వులు పంపించారని, ఆ తర్వాత ఏడు కోట్లు వేరువేరు ఖాతాలకు డిపా జిట్ చేయాలని కోరారు. ఒక బోగస్ వారం ట్‌ను కూడా ఓస్వాల్‌కు జారీ చేసారు. ఈడీ మోనోగ్రామ్, ఈడీ స్టాంపులు, ముంబయి పోలీస్ గుర్తులతో నీరాయ్‌కుమార్ సంతకంతో వచ్చిందని, ఇడి అసిస్టెంట్ డైరెక్టర్‌గా చెప్పు కున్నారని వివరించారు. మొత్తంగా దర్యాప్తు చేసిన ఆర్థికనేరాలు సైబర్ విభాగం మొత్తంగా 5.25 కోట్లు రాబట్టగలిగారు. ఈ నేరంలో అంతర్‌రాష్ట్ర ముఠా ఉందని, ఇద్దరు నింది తులు అతను చౌదరి, ఆనంద్‌కుమార్‌లు అస్సాంలోని గువాహతి నుంచి అదుపులోకి తీసుకున్నామని, వీరిద్దరు చిరువ్యాపారుల న్నారు.

## సర్పంచ్ కుర్చీకి రూ.2 కోట్లు.. వేలం పాటతో ఎన్నిక!

**చండీగఢ్, అక్టోబరు1:** పంజాబ్‌లో మరికొన్ని రోజుల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగ నున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే కొన్ని స్థానా లు ఏకగ్రీవమైనట్లు ప్రకటనలు వచ్చాయి. అయితే ఈ పోలింగ్ ప్రక్రియతో సంబంధం లేకుండా ఓ గ్రామంలో సర్పంచిని వేలం పాటలో ఎన్నుకోవటం గమనార్హం. ఇందులోఈ పదవి ఏకంగా రూ.2కోట్లు పలకడం తీవ్ర చర్చనీయాంశమైంది. గురుదాస్‌పుర్‌లోని హర్దోవల్ కలన్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఊరి సర్పంచి పదవి కోసం వేలం పాట నిర్వహించారు. రూ.50 లక్షలతో వేలం మొద లవగా స్థానిక బిజెపి నేత ఆత్మాసింగ్ ఏకంగా రూ.2 కోట్లు పాడారు. గ్రామానికి ఎవరు ఎక్కువ నిధులు ఇస్తారో వారినే సర్పంచిగా ఎన్నుకుం టారని సదరు నేత చెబుతున్నారు. వేలం పాటకు గడువు ముగిసింది. ఇప్పటివరకు ఆత్మా సింగ్ మాత్రమే అత్యధిక బిడ్డింగ్ వేయడంతో ఆయననే సర్పంచ్‌గా ఏకగ్రీవం చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వేలం పాట ఎన్నికపై రాజకీయంగా తీవ్ర దుమారం మొదలైంది. ఇది బహిరంగ అవినీతి. ఇలాంటి ఎన్నిక అధికారికం కాదు. దీనిపై దర్యాప్తు చేసి బాధ్యులను జైలుకు పంపాలి అని కాంగ్రెస్ నేత ఒకరు డిమాండ్ చేశారు. ఇది వివాదాస్పదం కావడంతో దీనిపై దర్యాప్తుకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మరోవైపు సర్పంచి ఎన్నికకు ఆత్మాసింగ్ నామినేషన్ దాఖలు చేయడం గమనార్హం.

# 25శాతం రాయితీతో రైతులకు పప్పుశెనగ విత్తన పంపిణీ

**- చిన్నముష్టూరు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఏవో శుభకర్**

ఉరవకొండ, అక్టోబర్ 1 ప్రభాతవార్త




కంది చేనులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం




రైతులకు అవగాహన కలిపస్తున్న మండల వ్యవసాయాధికారి జి.శుభకర్

రబీ పంట కాలంలో సాగు చేసుకోవడానికిగాను ప్రభుత్వం రైతులకు 25శాతం రాయితీతో పప్పుశెనగ విత్తనం పంపిణీ చేస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.శుభకర్ తెలిపారు. మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించగా పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్, ఉద్యానశాఖ అధికారి నెట్టికంటయ్య, పశు వైద్యురాలు డాక్టర్ శ్రీవిద్య హాజరయ్యారు. కంది పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి స్థానిక రైతు సేవా కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో శుభకర్ మాట్లాడుతూ పప్పుశెనగ క్వింటాల్ పూర్తీ ధరను ప్రభుత్వం 9,400 రూపాయలుగా నిర్ణయించిందని 25శాతం రాయితీపోనూ రైతు 7,050 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక రైతుకు ఎకరాకు 20 కేజీల బస్తా చొప్పున గరిష్టంగా 2 క్వింటాళ్ల వరకు విత్తనం అందించడం జరుగుతుందని వివరించారు. కంది పంటలో ప్రస్తుతం మరుకా మచ్చల పురుగు, శనగపచ్చ పురుగు అక్కడక్కడ కనుబడుతోందని దీని నివారణకు రైతులు 30 రోజుల పైరులో అయితే ఒక లీటరు నీటిలో 2 ఎంఎల్ వేప నూనెను కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. 50 రోజులు పైబడిన పైరులో క్వినాల్‌ఫాస్ లేదా క్లోరిఫైరిఫాస్ ఒక లీటరు నీటిలో 2 ఎంఎల్ కలపి పిచికారి చేసుకుంటే పురుగుల ఉద్ధృతి తక్కుతుందన్నారు. పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో పశువులకు వచ్చే గాలికుంట తదితర వ్యాధులను నివారించడానికి టీకాలు వేయడం జరుగుతుందని పశు వైద్యశాలలో సంప్రదించాలన్నారు. హెచ్‌వో నెట్టికంటయ్య మాట్లాడుతూ డ్రిప్, స్ప్రింక్లరు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు ఆర్‌ఎస్‌కేలో సిబ్బందిని కలిసి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కే సిబ్బంది భీమేష్, టీడీపీ నాయకులు నెట్టం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ల పంపిణీను పర్యవేక్షించిన మేజర్ పంచాయతీ కార్యదర్శి

**- తెల్లవారుజాము నుండే ఇంటింటికీ వెళ్లిన సిబ్బంది**

ఉరవకొండ, అక్టోబర్ 1 ప్రభాతవార్త



పింఛన్ పంపిణీను పర్యవేక్షిస్తున్న మేజర్ పంచాయతీ కార్యదర్శి ఏ.గౌస్‌సాహెబ్

పట్టణంలోని 5 సచివాలయాల పరిధిలో కొనసాగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీను మంగళవారం మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏ.గౌస్‌సాహెబ్ పర్యవేక్షించారు. పింఛన్ల పంపిణీ సిబ్బంది తెల్లవారు జాము నుండే లబ్దిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయగా ఆయన పర్యవేక్షించి పంపిణీ సజావుగా కొనసాగేలా చూశారు. ఈ సందర్బంగా కార్యదర్శి ఏ.గౌస్‌సాహెబ్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ రోజు లబ్దిదారులు ఇళ్లవద్దనే ఉంటే సిబ్బంది పంపిణీ చేయడానికి వీలుగా ఉంటుందన్నారు.

# రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో శ్రమదానం

**- పిచ్చిమొక్కలు, చెత్తా చెదారం తొలగించి జెడ్పీహెచ్‌ఎస్ స్కౌట్ విద్యార్థులు**

ఉరవకొండ, అక్టోబర్ 1 ప్రభాతవార్త



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న జెడ్పీ ఉన్నత పాఠశాల స్కౌట్ విద్యార్థులు

మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కౌట్ విద్యార్థులు శ్రమదానం నిర్వహించి పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్బంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పావని మాట్లాడుతూ స్కౌట్ విద్యార్థులు శ్రమదానం నిర్వహించి పీహెచ్‌సీ ఆవరణాన్ని శుభ్రం చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్, పీహెచ్‌సీ సీహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ షఫీ, సూపర్‌వైజర్ శేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల్లో పొలం పిలుస్తోంది

ధర్మవరం రూరల్, అక్టోబర్ 1 ప్రభాతవార్త




పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం మండల పరిధిలోని చిగిచెర్ల, ఉప్పునేసినపల్లి గ్రామాలలో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖలు, కెవికె శాస్త్రవేత్త కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా చిగిచెర్ల గ్రామంలో రైతు రాఘవరెడ్డి, కంది పంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో భాగంగానే ఉప్పు నేసినపల్లిలో వేరుశనగ పంట పొలాలను పరిశీలించారు. పంట అధిక దిగుబడులు సాధించడానికి వ్యవసాయ అధికారులు రైతులకు మెలుకువలు తెలిపారు. కంది పంట పూత పిందెలో దశలో పచ్చపురుగు నివారణ కోసం ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములు ఎకరాకు, 19:19:19 ఒక కేజి ఎకరాకు, బోరాన్ 0.50 కెజి ఎకరాకు మొగ్గ విడిచిన తర్వాత పిచికారి చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముస్తఫా, సిరికల్చర్ టెక్నికల్ ఆఫీసర్ బాబయ్య, ఏఈఓ భార్గవ్, పశువైద్యులు శేఖర్, ఉప్పు నేసిన పల్లి సర్పంచు ముత్యాలప్పనాయుడు, చిగిచెర్ల ఓబిరెడ్డి, రాఘవరెడ్డి, ఎపిసిఎన్‌ఎఫ్ కోఆర్డినేటర్ ఆదినారాయణ, ఇరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# విద్యను వ్యాపారం చేస్తు, తల్లిదండ్రుల రక్తం పీలుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**- ఐక్య విద్యార్థి సంఘాల వినతి**

ధర్మవరం, అక్టోబర్ 1 ప్రభాతవార్త



ఎంఈఓకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పట్టణంలో విద్యను వ్యాపారంచేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అదే విధంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నటువంటి పాఠశాలలపైన చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ధర్మవరం పట్టణంలోని ప్రైవేట్ సంస్థల దోపిడికి అడ్డు అదుపు లేకుండా పోతోందని, విద్యా హక్కు చట్టం జీవో నెంబర్ 1ని పాటించకుండా ప్రైవేట్ పాఠశాలలను నడుపుతా ఉన్నారు. ఈ పాఠవాల వారు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు చేస్తూ విద్యార్థులకు కనీసం మౌలిక సదుపాయాలు కూడా కల్పించకుండా ఇష్టానుసారంగా ధనార్జన, ధ్యేయంగా పేద విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ, అదే విధంగా హాస్టల్‌కు అనుమతులు లేకుండా ఉన్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ వేలాది రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రులు నుంచి నిలువు దోపిడి చేస్తున్నారన్నారు. దీనిపై వెంటనే ఎంఈఓ చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమంలు చేపడుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు పురుషోత్తం, నాగార్జున ప్రసాద్, విజయ్‌కుమార్, అమర్‌నాథ్‌రెడ్డి, హరి, మంజుల, నరేంద్ర, పోతులయ్య, నిరంజన్, బాలాజీ, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాక్సులంగడీ క్రీడలో చెన్నేకొత్తపల్లి మోడల్ స్కూల్ బాలికలు విజేతలు

చెన్నేకొత్తపల్లి, అక్టోబర్ 1 ప్రభాతవార్త



బహుమతులను చూపుతున్న గెలుపొందిన బాలికలు

నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన బాకుస్రలంగడి క్రీడలో అండర్-17, అండర్-19 రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో చెన్నే కొత్తపల్లి మోడల్ స్కూల్ నుంచి బాలికలు 29న ఆదివారం పాల్గొన్నారు. ఈ పోటీలలో అండర్ 19 పోటీలలో మంచి ప్రతిభ కనబర్చిన సికెపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థినీలను విజేతలుగా నిలిచారు. అండర్-17లో నిలిచారు. వీరు మళ్లీ చండీగర్‌లో నిర్వహించే నవంబర్ 5, 6, 7 తేదీల్లో జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు పి.ఈ.టి.పిఈటి కొండమ్మ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మాట్లాడుతూ.. చెన్నేకొత్తపల్లి ఆదర్శ పాఠశాల బాలికలను జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించడానికి మోడల్ స్కూల్ కృషి మరువలేనిదని అన్నారు. మాకు ఇలాంటి పిఈటీ, టీచర్ దొరకడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు.

# వృద్దులకు తెల్లవారుతూనే పెన్షన్లు

అగళి, అక్టోబర్ 1 ప్రభాతవార్త



పెన్షన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

వృద్దులు, వికలాంగులు, వితంతువులకు తెల్లవారు ఐదు గంటల నుంచే ఇంటి వద్దకే వెళ్లి సచివాలయ ఉద్యోగులు పెన్షన్లను పంపణీ చేశారు. మండల వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు ఇళ్ల వద్దకే వెళ్లి వృద్దులకు పింఛన్లు అందించడంతో వృద్దులు సంతోషం వ్యక్తం చేశారు. ఉదయం 8-9 గంటలలోపే దాదాపు 80శాతం పింఛన్లను ఉద్యోగులు పంపిణీ చేశారు. ఉద్యోగులు ప్రతిష్టాత్మకంగా పెన్షన్ పంపిణీని తీసుకున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సైతం పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇరిగేపల్లిలో సర్పంచు తమ్ముడు మంజునాథ్, కోడిపల్లిలో రమేష్ తదితరులు పెన్షన్ పంపిణీలో పాల్గొన్నారు.

# పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతన్నలు

అగళి, అక్టోబర్ 1 ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ శేఖర్‌నాయక్

మండల పరిధిలోని హెచ్‌డి హళ్లి, పి.బ్యాడిగెర గ్రామ రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యక్షంగా పొలాల్లోకి వెళ్లి రైతులకు ఏఓ శేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంకు రైతులందరూ ఆసక్తి చూపాలని రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలని, సేంద్రీయ విధానాన్ని అవలంభించాలని సూచించారు. నాణ్యమైన పంటలు పండటానికి సేంద్రీయ ఎరువులు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. పట్టు పరశ్రమ శాఖ వారు ప్రస్తుతం మల్బరి షెడ్లు, స్కీములను గురించి వివరించారు. పశు సంవర్ధక శాఖ వారు రైతులకు, పశువులకు ఇన్సురెన్స్ ఉందని మందులు కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ గురించి కంపెనీ వారు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రామకృష్ణప్ప, రైతులు చలపతి, మంజునాథ్, భూతరాజు తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణను పరామర్శించిన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి

గుత్తి, అక్టోబర్ 1 ప్రభాతవార్త



పరామర్శిస్తున్న దృశ్యం

గుత్తి మండల సిపిఎం కార్యదర్శి రామకృష్ణ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కర్నూల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకుని సోమవారం డిశ్చార్జ్ కావడం జరిగింది. విషయం తెలుసుకున్న సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి రాంభూపాల్ బసినేపల్లి గ్రామానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శివర్గసభ్యులు బి.శ్రీనివాసులు, నాయకులు నిర్మల, రమేష్, మల్లికార్జున, రేణుక, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రమేష్, ధనార్జున, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

# గుత్తిలో పెన్షన్ల పంపిణీ

గుత్తి, అక్టోబర్ 1 ప్రభాతవార్త



పెన్షన్లను పంపిణీ చేస్తున్న కమీషనర్

గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని 25వార్డుల్లో మంగళవారం ఉదయం 6 గంటల నుండి ఎన్‌టిఆర్ సామాజిక భద్రత ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కమీషనర్ జబ్బార్‌మియా తనిఖీ చేశారు. ఈ సందర్బంగా కమీషనర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు గుత్తి మున్సిపాలిటీ పరిధిలో వంద శాతం ఫించన్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ పి.రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాష, డిపిఒ నరేష్, సచివాలయం సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు దక్కిన అరుదైన గౌరవం

గుత్తి, అక్టోబర్ 1 ప్రభాతవార్త



అవార్డులను ప్రదర్శిస్తున్న దృశ్యం

ఎడ్యుస్కిల్స్ వారు నిర్వహించిన ఆల్ ఇండియా స్థాయి ర్యాంకుల్లో 13వస్థానం కైవశం చేసుకున్న గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు అరుదైన గౌరవం దక్కింది. సౌత్ సెంట్రల్ జోన్‌లో 2024 సంవత్సరానికి గాను బెస్ట్ ఫర్మామింగ్ ఇంజనీరింగ్ కళాశాలగా గుర్తింపు రావడం పట్ల గర్వంగా వుందని కళాశాల యాజమాన్యం పేర్కొన్నారు. అలాగే ఈ గుర్తింపు అకాడమిక్ క్వాలిటీ, ఇన్నోవేషన్ల పట్ల అంకితభావానికి ఇచ్చారని పేర్కొన్నారు. ఏఐసిటిఇ, ఎడ్యూస్కిల్స్ వారు ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డులను గేట్స్ కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తన్వీర్‌కు అందచేశారు. ఈ సందర్బంగా మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఇందుకు కృషి చేసిన కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిని కళాశాల యాజమాన్యం ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వికె పద్మావతి, డైరెక్టర్ శ్రీవాణి, ఎండి రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఎఒ ఇంతియాజ్‌బాష పాల్గొన్నారు.

# మద్యం దుకాణాలు మూసివేసి నిరసన

గుత్తి, అక్టోబర్ 1 ప్రభాతవార్త



దుకాణాలు మూసివేసి నిరసన తెలుపుతున్న దృశ్యం

పట్టణంలో మంగళవారం మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న వర్కర్లు దుకాణాలు మూసివేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం రిటైల్ మద్యం షాపులకు నోటిఫికేషన్ జారీ చేయడంతో వారు ఆందోళనకు దిగారు. ఐదు సంవత్సరాలపాటు పనిచేసినతమకు భవిష్యత్తుఎలా అంటూ వారు వాపోయారు. తమకు ప్రత్యామ్నాయ ఉపాధికల్పించాలని వారు డిమాండ్ చేశారు.

# జెవివి ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు

గుత్తి, అక్టోబర్ 1 ప్రభాతవార్త



బహుమతులు అందచేస్తున్న దృశ్యం

జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం దయానంద గురుకుల పాఠశాలలో మండల స్థాయి చెకుముకి పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా రెండు టీములు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఏపి మోడల్‌స్కూల్‌కు చెందిన సాయిధీరజ్, నందిని, హితేష్‌వర్ధన్‌లు, మహర్షి దయానంద గురుకుల పాఠశాలకు చెందిన దీక్షితాసాయి, వెంకటేష్, కార్తీర్‌లు ఎంపికయ్యారు. విజేతలకు ఏపి బిసి సంఘం రాష్ట్ర ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కెఇ సురేష్ బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రంగన్న, జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, మండల అధ్యక్షులు రామాంజినేయులు, జిల్లా నాయకులు నాగరాజు, శ్రీధర్, కోశాధికారి సీతానంద, ఏపిబిసి రాష్ట్రం సంఘం నాయకులు శ్రీనివాసులు, శ్రీనివాసయాదవ్, శివ, ప్రిన్సిపాల్ ఉషాగారిణి, హెచ్‌ఎం జాన్‌డేనియల్, కరస్పాండెంట్ వేదమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పొలం పిలుస్తోంది కార్యక్రమం



పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం, అక్టోబర్ 1 ప్రభాతవార్త

అమరాపురం మండలం బసవనపల్లి గ్రామ పంచాయతీలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి మంజునాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో యాజమాన్య పద్దతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చున్నారు. అదేవిధంగా రైతులు సగుచేసిన పత్తి, వేరుశనగ, మల్బరీ, తదితర పంటలను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు హాజరై సంక్షేమ పథకాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మంజునాథ్, సిరికల్చర్ అధికారి వేణుగోపాల్‌నాయక్, పశుసంవర్ధకశాఖ కరిష్మా, అగ్రికల్చర్ అసిస్టెంట్ గురుస్వామి, బసవనపల్లి టిడిపి పంచాయతీ అధ్యక్షులు పరమేశ్వర్, రాష్ట్ర దాసరి సాధికారిక సభ్యులు దాసరి, రవి, రైతు సేవా కేంద్రాల అధికారులు రంగనాథ్, పవిత్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# నేడు అగ్నిగుండం కార్యక్రమం

అమరాపురం, అక్టోబర్ 1 ప్రభాతవార్త

మండలంలోని మద్దనకుంట గ్రామంలో వెలసిన శ్రీమహేశ్వరిదేవి దేవాలయంలో బుధవారం రాత్రి అగ్నిగుండం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు జెఇ యంజారప్ప, అర్చకులు సిద్ధప్ప తెలిపారు. అమ్మవారి 15వ నవరాత్రి ఉత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా ధ్వజారోహణం, దేవి పారాయణము, అగ్నిగుండం కార్యక్రమంతో పాటు విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. అదేవిధంగా వీరబ్రహ్మేంద్రస్వామి భక్తాదులచే భజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

# అమరాపురం ఎంపిడిఒగా రామారావు

అమరాపురం, అక్టోబర్ 1 ప్రభాతవార్త

అమరాపురం ఎంపిడిఒగా రామారావును నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు అందినట్లు సమాచారం. ప్రస్తుతం అమరాపురం ఇన్‌చార్జ్ ఎంపిడిఒగా వున్న భాస్కర్ అనంతపురం జిల్లా పరిషత్‌కు బదిలీ అయినట్లు సమాచారం.

# మహిళ రేప్ కేసులో నింధితుడు అరెస్టు

తాడిమర్రి, అక్టోబర్ 1 ప్రభాతవార్త



రేపిస్టును అరెస్టు చేసిన దృశ్యం

మండలంలోని శివంపల్లి గ్రామానికి చెందిన మహిళను అత్యాచారం చేసిన కేసులో నింధితున్ని అరెస్టు చేసినట్లు సిఐ శ్యామ్‌రావు తెలిపారు. మంగళవారం నింధితున్ని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. శివంపల్లి గ్రామానికి చెందిన యువతి బహిర్భూమికి వెళ్లి వస్తుండగా బలవంతంగా యువతిని లాక్కెళ్లి నూతనంగా నిర్మిస్తున్న ఇంటిలో అత్యాచారం చేశావరన్నారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు దేరంగుల నరసింహులుని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇటువంటి మృగాలపట్ల మహిళలు జాగ్రత్తగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఈ నెల 3 నుంచి లక్ష్మి చెన్నకేశవస్వామి శరన్నవరాత్రులు

ధర్మవరం రూరల్, అక్టోబర్ 1 ప్రభాతవార్త



పట్టణంలోని బ్రాహ్మణ వీధిలోగల శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి దేవాలయంలో దసరా శరన్నవరాత్రుల మహోత్సవ వేడుకలు ఈ నెల మూడవ తేది నుంచి 12వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన ఈఓ వెంకటేశులు, అర్చకులు కోనేరాచార్యులు, మకరంద బాబు, భాను ప్రకాష్, చక్రధర్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శాశ్వత వంశపారంపర్య ఉభయ దాతలుగా జగ్గా వంశీయులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ధర్మవరం ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ధర్మవరం నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూధన్‌రెడ్డి కూడా పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 3వ తేదిన రాజరాజేశ్వరి దేవి అలంకారం, నాల్గవ తేదిన మహాలక్ష్మి, ఐదవ తేదిన లక్ష్మినరసింహస్వామి, ఆరవ తేది అన్నపూర్ణేశ్వరిదేవి, ఏడవ రోజు రంగనాయకుల స్వామి అలంకారం, 8వ తేదిన లలితాదేవి, 9వ తేది వరాహ నరసింహస్వామి, 10న దుర్గాదేవి, 11న శ్రీకృష్ణ అలంకారముతో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ఈ నెల 12వ తేది చివరి రోజున గ్రామ సభ అలంకరణ ఉంటుందని తెలిపారు. కావున ఈ వేడుకలకు అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

# వరద బాధితులకు రూ.50వేలు సహాయం

గుడిబండ, అక్టోబర్ 1 ప్రభాతవార్త



వరద బాధితులకు సహాయాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని రవీంద్ర విద్యానికేతన్ విద్యాయల ఉపాధ్యాయులు, విద్యార్థులు విజయవాడ వరద బాధితులకు తమ వంతు సహాయంగా 50వేల రూపాయలు అందించడానికి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం సభ్యులు రాజు, చిత్తయ్యలు మాట్లాడుతూ.. మా పాఠశాల విద్యార్థులు, సిబ్బంది వరద బాదితులకు విరాళాలు అందించడం సంతోషంగా ఉందని ఈ నెల మూడవ తేదిన లోకేష్ బాబుకు చెక్కును అందిస్తామన్నారు.

# పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

గుడిబండ, అక్టోబర్ 1 ప్రభాతవార్త



పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మండల పరిధిలోని రాళ్లపల్లి, కేకాతి గ్రామాలలో మడకశిర ఎమ్మెల్యే రాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చిన మాటకు కట్టుబడి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పింఛన్లను వెయ్యికి పెంచి అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రామారావు, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, మాజీ సర్పంచు శ్రీనాథ్, జంబలబండరవి, నజీర్, వెంకటేష్, జగన్నాథ్, వైస్ సర్పంచు నాగేంద్ర, డాక్టర్ కృష్ణమూర్తి, క్లస్టర్ ఇన్‌చార్జ్ లక్ష్మినరసప్ప, బీమరాజ్, బూదిపల్లి జయరామప్ప, రామచంద్ర, నటరాజు, వెంకటరమణ, మాస్ తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 12 గంటల్లోనే 96 శాతం ఫించన్లు పంపిణీ

**- కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా**

గోరంట్ల, అక్టోబర్ 1 ప్రభాతవార్త



గ్రామాల్లో ఫించన్లు పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ

గోరంట్ల మండల వ్యాప్తంగా అక్టోబర్ నెలకు సంబంధించి పింఛన్లు మంగళవారం ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు దాదాపు 96 శాతం పంపిణీ జరిగినట్లు మండల ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని నార్శింపల్లి పంచాయతీ పరిధిలోని ఎర్రబెల్లి గ్రామంలో జరుగుతున్న పెన్షన్ల పంపిణీ తీరును తనిఖీ చేస్తూ ఆయన తన చేతుల మీదుగా లబ్దిదారులకు ఫించన్ మొత్తాన్ని అందచేశారు. మండల వ్యాప్తంగా 11,453 మంది పెన్షన్‌దారులకు గాను 4,83,89,500 రూపాయలు మంజూరైందని ఇందులో మంగళవారం 11,023 మందికి సాయంత్రం 5లోపు పెన్షన్లను అందచేయడం జరిగిందని మిగిలిన వారికి కూడా అందచేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.




మహాత్మాగాంధీ యొక్క 155వ జయంతి



శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి యొక్క 120వ జయంతి

Government of Karnataka

సమాచార మరియు పౌర సంబంధాల శాఖ



# సత్యం కోసం పోరాటం...

## గాంధీజీ నుండి నిత్య జీవిత పాఠం

### "సత్యమేవ జయతే....

మహాత్మా గాంధీజీకి సత్యమే దేవుడు, అతను అసత్యం నుండి సత్యాన్ని క్రమబద్ధీకరించడానికి తన జీవితాన్ని అంకితం చేసాడు, ఎందుకంటే సత్యం చివరికి విజయం సాధిస్తుందని అతనికి తెలుసు. సత్యం మరియు సామాజిక న్యాయం కోసం పోరాడటానికి నేను గాంధీజీ జీవితం నుండి ఒక పత్రాన్ని తీసుకుంటాను."

- సిద్ధరామయ్య, ముఖ్యమంత్రి





శ్రీ డి.కె. శివకుమార్

గౌ॥ డిప్యూటీ ముఖ్యమంత్రి

DELIVERED AS PROMISED...

Shakthi — FREE BUS Service for women across Karnataka

Anna Bhagya — 10kg Free Food Grains (per person / per month) Rs. 170 per head in lieu of 5kg food grains

Gruha Jyothi — Up to 200 Units of Free Electricity to each home

Gruha Lakshmi — ₹2000 per month to female head of the family

Yuva Nidhi — ₹3000 Per month for Graduates | ₹1500 Per month for Diploma Holders

"As is enshrined in our Constitution - to cherish and follow the noble ideals which inspired our national struggle for freedom is the fundamental duty of every citizen of the country."

CMofKarnataka https://dipr.karnataka.gov.in/

karnataka information

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot no B11 & B12, Industrial Park, Bellary Road, Anantapur. Phone :9848996402 Mail. vaartthaatp@gmail.com, RNI No. 70088/97, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/18-20 **Air Surcharge:** Delhi : 40 Ps.